రాబడి

ఈటీఎఫ్‌లంటే ఏంటో తెలుసా?

- ఈటీఎఫ్‌లు ఈక్విటీ, డెట్, కమోడిటీస్ వంటి వివిధ రకాల సాధనాల కోసం అందుబాటులో ఉంటాయి.
- సాధారణంగా వీటికయ్యే వ్యయభారం తక్కువే. అయితే ఈటీఎఫ్‌ల క్రయవిక్రయాల్లో బ్రోకరేజీ ఫీజులు, ఇతరత్రా ట్రేడింగ్ ఖర్చులు తప్పవు.
- ట్రేడింగ్ జరిగే రోజున ఈటీఎఫ్‌లను నాటి మార్కెట్ ధరల వద్దే కొనవచ్చు.. అమ్మవచ్చు.
- ఒక సూచీ ప్రదర్శనను ప్రతిబింబించడమే ఈ ఈటీఎఫ్‌ల లక్ష్యం.
- మ్యూచువల్ ఫండ్స్‌తో పోల్చితే దేశంలో అందుబాటులో ఉన్న ఈటీఎఫ్‌లు పరిమితం.
- ఆన్‌లైన్ బ్రోకర్లు, సంప్రదాయ బ్రోకర్-డీలర్ల ద్వారా ట్రేడ్ అవుతాయి.
- ఇండివీడ్యువల్స్ తమ రిటైర్మెంట్ ఖాతాల్లోనూ వీటిని కొనవచ్చు.

లాభాల స్వీకరణకు అవకాశం!

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాల్లో దూసుకుపోతున్నాయి. మదుపరులు కొనుగోళ్ల జోష్‌లో ఉన్నారు. ఫలితంగానే గత వారం సూచీలు ఆల్‌టైమ్ హైల్లో స్థిరపడ్డాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,279.56 పాయింట్లు లేదా 1.57 శాతం ఎగబాకి మునుపెన్నడూ లేనివిధంగా 82,365.77 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 412.75 పాయింట్లు లేదా 1.66 శాతం ఎగిసి తొలిసారి 25,235.90 దగ్గర ముగిసింది. కాగా, మార్కెట్లు నూతన గరిష్ఠాల వద్ద ఉండటంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణ దిశగా అడుగులు వేసే వీలుందని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వారం కరెక్షన్‌కు అవకాశాలు లేకపోలేదని అంటున్నారు. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. కాగా, అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,850 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,500-25,700 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

ఇలా.. ప్లాన్ చేసుకోండి

సీనియర్ సిటిజన్ల పెట్టుబడికున్న 10 అత్యుత్తమ మార్గాలివే

ఆర్థిక ప్రణాళికలో పొదుపు, పెట్టుబడులకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. అవగాహన, వివేకంతో ముందుకెళ్తే ఆకర్షణీయ స్థాయిలో రాబడులను పొందవచ్చు. ఇక సాధారణ సిటిజన్స్‌తో చూస్తే సీనియర్ సిటిజన్ల పెట్టుబడులకున్న 10 అత్యుత్తమ మార్గాలను ఒక్కసారి పరిశీలిస్తే వాటిలో..

1

- **సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీం**

పదవీ విరమణ పొందినవారు ఎక్కువగా ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల గురించే ఆరా తీస్తూ ఉంటారు. సురక్షిత, స్థిరమైన ఆదాయ వనరును కోరుకుంటారు. అలాంటి వాటిలో సీనియర్ సిటిజన్ సేవింగ్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్) ఒకటి. ఇదో కేంద్ర ప్రభుత్వ పథకం. పూర్తిగా రిస్క్ లేని రుణ సాధనం. 60 ఏండ్లు, ఆపై వయసువారి కోసమే తెచ్చారు. ప్రస్తుత వడ్డీరేటు 8.20 శాతం. ప్రతీ 3 నెలకోసారి సవరిస్తారు. కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠం రూ.30 లక్షలు. ఈ స్కీం గరిష్ఠ పరిమితి 5 ఏండ్లు. ఈ పెట్టుబడి మొత్తాలు పన్ను పరిధిలోకి రావు. అయితే వీటిపై పొందే వడ్డీ ఆదాయం వారివారి ఐటీ స్లాబుల ప్రకారం చెల్లించాల్సి ఉంటుంది.

2

- **పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం**

తపాలా శాఖ అందించే ఈ స్కీంలో పెట్టుబడులకుగాను నెలనెలా నిర్ణీత స్థాయిలో వడ్డీ ఆదాయాన్ని పొందవచ్చు. రిటైర్మెంట్ వయసులో ఆర్థిక భద్రతకు చక్కని అవకాశం. అయితే సీనియర్ సిటిజన్లకే కాదు.. 10 ఏండ్లు దాటిన భారతీయ పౌరులెవరైనా ఇందులో పెట్టుబడులకు దిగవచ్చు. దీని వార్షిక వడ్డీరేటు 7.40 శాతంగా ఉన్నది. ప్రతీ 3 నెలలకోసారి మారడానికి ఆస్కారం ఉన్నది. కనీస పెట్టుబడి రూ.1,500. గరిష్ఠ పెట్టుబడి రూ.4.5 లక్షలు. జాయింట్ అకౌంట్‌లో రూ.9 లక్షలదాకా పెట్టుబడులు పెట్టవచ్చు. కాలపరిమితి 5 ఏండ్లు. ఆ తర్వాత మరో 5 ఏండ్లు కూడా పొడిగించుకోవచ్చు. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి.

3

- **ఫిక్స్‌డ్ డిపాజిట్లు**

రెగ్యులర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లే (ఎఫ్‌డీ) ఇవి. బ్యాంకుల్లో సాధారణ పౌరులతో పోల్చితే సీనియర్ సిటిజన్లకు ఆయా కాలపరిమితుల ఎఫ్‌డీలపై వడ్డీరేట్లు ఎక్కువగా లభిస్తాయి. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఎఫ్‌డీలలో పెట్టుబడులకు పన్ను మినహాయింపున్నది. ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అలాగే నెలవారీగా, 3 నెలలవారీగా, వార్షిక ప్రాతిపదికన నగదునూ పొందవచ్చు. మార్కెట్ రిస్కులకు దూరంగా ఉంటూ సురక్షితమైన పెట్టుబడులను, స్థిరమైన ఆదాయాన్ని ఆశించేవారు ఈ ఎఫ్‌డీలను పరిశీలించవచ్చు.

4

- **సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్**

సిస్టమ్యాటిక్ డిపాజిట్ ప్లాన్‌లో సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) ఫీచర్లుంటాయి. ఒకేసారి పెద్ద మొత్తాల్లో డిపాజిట్లకు బదులు చిన్నచిన్న మొత్తాల్లోనూ డిపాజిట్లకు ఇందులో వీలుంటుంది. నెలనెలా మనం చేసే ప్రతీ డిపాజిట్‌ను ఓ ఎఫ్‌డీగానే చూస్తారు. తక్కువలో తక్కువగా రూ.5వేలతో ఈ మంత్లీ డిపాజిట్లను ప్రారంభించవచ్చు. ఇక ఇందులో రెండు వేరియంట్లుంటాయి. ఒకటి సింగిల్ మెచ్యూరిటీ స్కీం, మరొకటి మంత్లీ మెచ్యూరిటీ స్కీం. వార్షిక వడ్డీరేట్లు 8.50 శాతందాకా ఉన్నాయి. ఏడాది నుంచి ఐదేండ్ల కాలపరిమితితో పెట్టుబడులు పెట్టవచ్చు.



5

- **నేషనల్ పెన్షన్ సిస్టమ్**

నేషనల్ పెన్షన్ సిస్టమ్ అనేది కేంద్ర ప్రభుత్వం అందించే రిటైర్మెంట్ సేవింగ్స్ స్కీం. పదవీ విరమణ కాలంలో స్థిరమైన ఆదాయ వనరుగా ఉంటుంది. సంఘటిత, అసంఘటిత రంగాల్లోని ఉద్యోగులకు ఇది చక్కని పథకమనే చెప్పవచ్చు. ఉద్యోగుల నుంచి, వారి సంస్థల తరపు నుంచి ఇందులోకి నగదు జమవుతుంది. ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ, సెక్షన్ 80సీసీడీ(1బీ) కింద పన్ను ప్రయోజనాలు దక్కుతాయి.

6

- **సీనియర్ సిటిజన్ ఎఫ్‌డీ స్కీం**

60 ఏండ్లు, ఆపై వయసున్నవారికి రెగ్యులర్ ఇన్‌కమ్‌ను అందించడానికి వచ్చినదే ఈ సీనియర్ సిటిజన్ ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) స్కీం. బ్యాంకులను బట్టి డిపాజిట్లకున్న కనీస, గరిష్ఠ పరిమితులు ఆధారపడి ఉంటాయి. కాలపరిమితి 7 రోజుల నుంచి 10 ఏండ్లదాకా ఉంటుంది. వార్షిక వడ్డీరేట్లు 9.75 శాతం వరకున్నాయి. అత్యవసర పరిస్థితిలో ఎఫ్‌డీని వెనక్కి తీసుకోవచ్చు. అయితే జరిమానాలను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఎఫ్‌డీల తనఖాపై రుణాలనూ పొందవచ్చు. మీ డిపాజిట్లపై రుణ మొత్తాలు ఆధారపడి ఉంటాయి. రూ.50వేల దాకా పన్ను మినహాయింపుంటుంది.



7



- **ట్యాక్స్ ఫ్రీ బాండ్లు**

ట్యాక్స్ ఫ్రీ బాండ్లలో పెట్టుబడి పెట్టేవారికి చెల్లించే వడ్డీకి పన్ను మినహాయింపు ఉంటుంది. ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, ప్రభుత్వ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్లు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు ఈ బాండ్లను ప్రభుత్వం తరపున జారీ చేస్తాయి. కాబట్టి ఇదో భద్రత కలిగిన పెట్టుబడి సాధనం.

8



- **ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం**

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీం (ఈఎల్ఎస్ఎస్) అనేది ఓ ట్యాక్స్-సేవింగ్ మ్యూచువల్ ఫండ్ స్కీం. స్టాక్ మార్కెట్లు లేదా వాటి సంబంధిత సాధనాల్లో పెట్టుబడులను పెట్టడం జరుగుతుంది. అయితే ఇందులో రిస్క్ ఉంటుందన్న విషయం మరువద్దు. అయినప్పటికీ వేచిచూస్తే పెట్టుబడులపై మంచి ఆదాయాన్ని సొంతం చేసుకోవచ్చు. తక్కువ రిస్కుతో ఎక్కువ రాబడులను అందుకోవచ్చు మరి. ఇక ఐటీ చట్టంలోని సెక్షన్ 80సీ కింద ఏటా రూ.1.5 లక్షల దాకా పన్ను ఆదా చేసుకోవచ్చు. అయితే వీటిల్లో లాకిన్ పీరియడ్స్ ఉంటాయి.

9

- **మ్యూచువల్ ఫండ్స్**

మ్యూచువల్ ఫండ్స్‌ల్లో పెట్టుబడులు మార్కెట్ రిస్కులకు లోబడి ఉంటాయి. పెట్టుబడులు పెట్టే ముందే సంబంధిత డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం మంచిది. నిజానికి రిస్కులకు దూరంగా ఉండాలనుకునే మదుపరులకు ఇవి పనికిరావు. ఈక్విటీ, రుణ మార్కెట్లలో మీ సొమ్మును మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్ చేయడమే ఇందుకు కారణం. అయితే ధైర్యంతో నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ఆకర్షణీయ రాబడులనే అందిస్తాయని చెప్పవచ్చు. కాబట్టి నిపుణుల సలహా మేరకు మీ ఇన్వెస్ట్‌మెంట్ పోర్ట్‌ఫోలియోలో మ్యూచువల్ ఫండ్స్‌కూ కొంత భాగం ఇవ్వవచ్చు. లాభాలపై మూలధన లాభాల పన్నులుంటాయి.

10

- **పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్**

సీనియర్ సిటిజన్లకు పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) కూడా ఆకర్షణీయమైన పెట్టుబడి సాధనాల్లో ఒకటి. ఇదో సురక్షిత పెట్టుబడి మార్గం. పీపీఎఫ్‌ల్లో పెట్టుబడి ఏటా రూ.1.5 లక్షలదాకా పన్ను ఆదాకు అవకాశాన్నిస్తుంది. పీపీఎఫ్ ఖాతా పరిమితి 15 ఏండ్లు.

ప్రాణం తీసిన టీవీ చానల్

నార్నూర్, సెప్టెంబర్ 1 : ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని కొలాంగూడకు చెందిన సేదం లక్ష్మణ్ (35) ఆదివారం మధ్యాహ్నం పక్కనే ఉంటున్న కొడప జైతు ఇంట్లో టీవీ చూడడానికి వెళ్లాడు. అప్పటికే జైతు, రాములు టీవీ చూస్తున్నారు. లక్ష్మణ్ టీవీ ఛానల్ మార్చాలని రాముతో గొడవ పడ్డాడు. తాగిన మత్తులో ఉన్న మాడావి రాము చంపేస్తానని లక్ష్మణ్ చాతిపై పిడికిలితో బలంగా కొట్టి, గొంతు నొక్కాడు. గొడవ విషయాన్ని గమనించిన లక్ష్మణ్ భార్య మంతుబాయి కేకలు వేయడంతో పక్కనే ఉన్న సిదం భుజంగ్‌రావు అక్కడికి వెళ్లే చూసే సరికి లక్ష్మణ్ స్పృహ కోల్పోయాడు. దీనిని గమనించిన రాము అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే గ్రామస్తుల సహాయంతో లక్ష్మణ్‌ను వైద్యం కోసం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరిస్తుండగా.. మార్గ మధ్యలోనే మృతి చెందాడు. మంతుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నార్నూర్ సీఐ రహీం పాషా తెలిపారు.

సూపర్ మార్కెట్‌లో పిడుగు పాటు

సూపర్ మార్కెట్‌లో మంటలు, ఆర్పుతున్న సిబ్బంది

ఉట్నూర్, సెప్టెంబర్1: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని జీసీసీ సూపర్ మార్కెట్‌లో ఆదివారం రాత్రి పిడుగు పడింది. సీసీ కెమెరాలకై ఏర్పాటు చేసిన సిస్టంపై పిడుగు పడడంతో ఒక్క సారిగ పొగలతో కూడిన మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు ఉట్నూర్ ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో వెంటనే చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు 50వేల నుండి లక్ష వరకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఫైర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో నష్టం చాలా తగ్గిందని స్థానికులు పేర్కొన్నారు.

అరెస్ట్.. రిమాండ్

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్య నగర మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపం వద్ద క్రాంతినగర్‌కు చెందిన షేక్ కలీం గంజాయి విక్రయిస్తున్న పట్టుకున్నామని టు టౌన్ ఎస్ఐ విష్ణు ప్రకాష్ తెలిపారు. అతని వద్ద నుంచి 510 గ్రాముల గంజాయి, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. వారం క్రితమే మహారాష్ట్ర పాండర్‌క్వాడ హనుమాన్ వ్యక్తి దగ్గర నుంచి ఒక కేజీ కొనుగోలు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

40 రోజుల పాదయాత్ర

ఎదులాపురం, సెప్టెంబర్ 1: ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ దళిత వికాస్ ఆధ్వర్యంలో పాదయాత్రను చేపడుతున్నామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కన్నెర సిద్ధార్థ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నీ ప్రింట్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమీలేయర్ విధానాన్ని అమలు చేస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని కోరారు. ఇందు కోసం 40 రోజుల పాదయాత్ర ఆదిలాబాద్ జిల్లా నుంచి గద్వాల జిల్లా అలంపూర్ ముగుస్తోందన్నారు.

ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారంలో డబ్బులు పెట్టవద్దు

పెంబి, సెప్టెంబర్ 1: ఆన్‌లైన్ కాయిన్ వ్యాపారం మోసపురితమని, కష్టపడి సంపాదించిన డబ్బులను దురాశతో ఆన్‌లైన్ యాప్‌లలో డబ్బులు పెట్టవద్దని ఎస్ఐ శంకర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు, మందపల్లి గ్రామంలో యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బిట్‌కాయిన్ పేరిట మోసం

- ఆన్‌లైన్ పేరిట మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టురట్టు
- స్టార్ రేటింగ్ ఉన్న వారందరిపై చర్యలు తీసుకుంటాం
- ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

నిర్మల్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ) : క్రిప్టో కరెన్సీ, బిట్‌కాయిన్ పేరిట అధిక వడ్డీ ఆశ చూపి అమాయకుల నుంచి ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టిస్తూ మోసాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును నిర్మల్ పోలీసులు రట్టు చేశారు. ఈజీ మనీకి అలవాటు పడ్డ కొందరు ఇదేపనిగా పెట్టుకుని వందలాది మందిని ఈ ఆన్‌లైన్ యాప్‌లో (యూ బిట్‌కాయిన్) బ్లాక్‌చైన్ టెక్నాలజీ ద్వారా నమోదు చేశారు. ఈ వ్యవహారంపై పోలీసులకు పక్కా సమాచారం అందడంతో మోసానికి పాల్పడుతున్న ఐదుగురు నిందితులను గుర్తించి అరెస్టు చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల వివరాలను వెల్లడించారు. కడెం మండలంలోని నవాబ్‌పేట్ గ్రామానికి చెందిన సల్ల రాజ్‌కుమార్, సాయి కిరణ్‌లతోపాటు నిర్మల్‌కు చెందిన కండెల నరేశ్, గంగాధర్, మహేశ్‌లు బిట్‌కాయిన్ పేరిట ఆన్‌లైన్ మోసానికి పాల్పడ్డారని తెలిపారు. బిట్‌కాయిన్ వ్యాపారం అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందని, ఇందులో లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతినెలా రూ.14 వేలు సంపాదించవచ్చంటూ వీరు చాలా మందిని ఈ దందాలోకి దించినట్లు గుర్తించామన్నారు. అలా చేర్పించిన వారందరితో వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి బహుమతులు, టూర్లు అంటు ఆకర్షణీయమైన ప్రకటనలను సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడంతో అనేక మంది ఈ మోసానికి గురయ్యారన్నారు. ఇలా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.50 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. కొంతమంది అప్పులు చేసి మరీ ఇందులో పెట్టుబడి పెట్టినట్లు తమ దృష్టికి రావడంతో ఈ ఆన్‌లైన్ వ్యాపారంపై భైంసా ఏసీపీ అవినాశ్‌కుమార్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి పూర్తి విచారణ జరిపామన్నారు. ప్రస్తుతం ఐదుగురిని గుర్తించి అరెస్టు చేశామని, ఇందులో ఇంకా చాలా మంది ప్రమేయం ఉందని, త్వరలోనే వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు. ముఖ్యంగా ఎక్కువ మంది నుండి డబ్బులు వసూలు చేసి ఈ ఆన్‌లైన్ వ్యాపారంలోకి దించిన వారికి యాప్ నిర్వాహకులు రేటింగ్ ఇచ్చారని, ఆ రేటింగ్ ఆధారంగా వన్ స్టార్, టూ స్టార్, త్రీ స్టార్ పొంది.. ఎక్కువ మందిని మోసం చేసిన వారిని గుర్తించే పనిలో ఉన్నామన్నారు. ప్రస్తుతం ఈ ఐదుగురిపై కేసులు న మోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దందాలో ప్రమేయమున్న వారి వివరాలను తెలుసుకునేందుకు కస్టడీ పిటిష న్ వేసి ఈ ఐదుగురిని మరింత లోతుగా విచారిస్తామన్నారు. ఇదే తరహా వ్యాపారం గత మార్చిలో హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రంలో జరుగగా, రూ.2,500 కోట్ల మేర అక్కడి ప్రజలు మోసపోయారని ఎస్పీ తెలిపారు. ఇలాంటి మోసాల భారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.



క్రిప్టో కరెన్సీ పేరిట మోసాలకు పాల్పడ్డ వారి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

ఈజీమనీకి ప్రయత్నించవద్దు...

ఈజీమనీ కోసం ఎవరూ ప్రయత్నించవద్దని ఈ సందర్భంగా ఎస్పీ ప్రజలకు సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆర్‌బీఐ అనుమతి ఉన్న బ్యాంకుల్లోనే పెట్టు బడులు పెట్టాలన్నారు. బిట్‌కాయిన్‌కు సంబంధించి జిల్లాలో పెట్టుబడులు పెట్టిన బాధితులు తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి తిరిగి డబ్బులు వచ్చేలా చూస్తామని తెలిపారు. కాగా ఈ బిట్‌కాయిన్ దందాపై వేగంగా విచారణ జరిపి నిందితులను అదుపులోకి తీసుకున్న భైంసా ఏసీపీ అవినాశ్‌కుమార్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, రూరల్ సీఐ రామకృష్ణలతోపాటు ఎస్సైలు సాయికృష్ణ, ఎం.రవి, రవీందర్‌ను ఎస్పీ అభినందించారు.

నేడు పోలాల పండుగ

ఇంద్రవెల్లి, సెప్టెంబర్1: పొలాల పండుగా అమావాస్య నేడే కావడంతో మండలకేంద్రంలో పొలాల పండుగా వాతావరణ నెలకొంది. ఆదివారం గ్రామాల నుంచి రైతులు మండలకేంద్రానికి తరలివచ్చి ఎడ్లజతలకు అలంకరించే వివిధ రకాల వస్తువులతోపాటు రంగులు, గజ్జలు, ముకతాడ్లు, జూల్లు, రంగురంగుల తాళ్లు, వివిధ రకాల పువ్వులను కొనుగోలు చేస్తూ బిజీగా కనిపించారు.

ఎడ్లజతల అలంకరణ వస్తువులు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ గిరిజ రైతు

అప్పులు ఇచ్చిన వారి వేధింపులకు గురై ఆత్మహత్య

ఇంద్రవెల్లి, సెప్టెంబర్1: ఏమాయికుంట గ్రామపంచాయతీ పరిధిలోని గలియబాయితండా గ్రామానికి చెందిన కేంద్రే దత్తా(41)అప్పులు ఇచ్చిన వారి వేధింపులకు గురై ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఆదివారం ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు. ఆదివారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం...గలియబాయితండా గ్రామానికి చెందిన కేంద్రే దత్తా డ్రైవర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత సంవత్సరం క్రితం ఇంటి అవసరాల కోసం ఇంద్రవెల్లి మండలకేంద్రానికి చెందిన కేంద్రే శివాజీ వద్ద రూ. 6లక్షలు, గోర్పనే దీపక్ నుంచి50వేలు, అదిలాబాద్ మండలంలోని చిచ్‌ధరిఖానాపూర్ గ్రామానికి చెందిన పవార్ ప్రకాష్ దగ్గర 3లక్షల50వేలు అప్పులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. అప్పులు ఇచ్చిన వారు ప్రతిరోజు ఇంటికి వచ్చి డబ్బులు తీరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వేధించారని, డబ్బులు ఇవ్వకుంటే ఉరేసుకొని చనిపో అంటూ హింసించారని పేర్కొన్నారు. తీసుకున్న అప్పులు తీర్చేందుకు తనవద్ద డబ్బులు లేకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆదివారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసినట్లు తెలిపారు. కొన ఊపిరితో ఉన్న కేంద్రే దత్తాను కుటుంబ సభ్యులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. భార్య కేంద్రే ఆశాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దుబ్బక సునీల్ తెలిపారు.

గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : ఆదిలాబాద్ పట్టణంలోని వివిధ గణేశ్ మండపాల నిర్వాహకులతో హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో సమావేశం నిర్వహించారు. గణేష్ మండలపాల వారు విద్యుత్ కనెక్షన్ కోసం ఎటువంటి రసుములు ఇప్పుడే చెల్లించొద్దని శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో చర్చించిన తర్వాత తెలియజేస్తామన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ సమితి అధ్యక్షులు బొంపెల్లి హన్మాండ్లు మాట్లాడుతూ వివిధ గణేశ్ మండపాల నిర్వాహకులు వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కోర్దెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నూర్ భాస్కర్, కోశాధికారి గండే ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షులు విశ్వనాథ్, రాజ్‌కుమార్, సభ్యులు కనక నర్సింగ్, తిరుమలేష్, సాయి శ్రీనివాస్, వివిధ గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

చిట్యాల్ బ్రిడ్జిపై పడిపోయిన వాహనం

సోన్, సెప్టెంబర్ 1: భైంసాలో ఇంటి సామానును దింపి తిరిగి వస్తుండగా వాహనం వాగులో పడిపోయిన ఘటన నిర్మల్ మండలం చిట్యాల్ బ్రిడ్జిపై చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆదివారం ఖానాపూర్‌లో నుంచి ఇంటి సామానును తీసుకొని భైంసాలో దింపి వస్తుండగా డ్రైవర్ చాంద్‌పాషా వేగంగా, అజాగ్రత్తగా ఐచర్ వాహనం నడిపి బ్రిడ్జిపై ఉన్న రెయిలింగ్‌ను ఢీకొట్టాడు. వాహనంతో పాటు అందులోని నలుగురు మహ్మద్ షాకిత్, మహ్మద్ సమీర్, అబ్దుల్ అయక్, సయ్యద్ షర్జిత్ వాగులో పడిపోయారు. డ్రైవర్‌తో పాటు నలుగురు వాహనం నుంచి బయటకు వచ్చి ఒడ్డుకు చేరారు. తహసీల్దార్ సంతోష్, ఆర్ఐ మోహన్, ఎస్సై సాయికుమార్, కానిస్టేబుల్ సంతోష్, రవిశంకర్, రాజ్‌కుమార్‌లు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. వాహనం నీటిలో పడిపోవడంతో రాత్రివరకు వాహన ఆచూకీ లభించలేదన్నారు.

కళాశాలల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ, సెప్టెంబర్ 1 : మండలకేంద్రంలో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలాభివృద్ధి కృషి చేస్తానని టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సమావేశానికి హాజరై మాట్లాడారు. ఇచ్చోడ డిగ్రీ కళాశాలలో సౌకర్యాల కల్పనకు గాను, నాన్ టీచింగ్ నియామకం కోసం, కళాశాల నూతన భవన నిర్మాణానికి పాటుపడతానన్నారు. అనంతరం ఆయనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కట్కం మురళి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్, కట్ట వేణు, మహేష్, నిర్మల్ జిల్లా కార్యదర్శి రవికుమార్, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి నర్సింగ్ రావ్, దయాకర్ పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ యుద్ధానికి నిరసన

ఎదులాపురం, సెప్టెంబర్ 1 : యుక్రెన్, పాలస్తీన్‌పై ఇజ్రాయిల్ యుద్ధోన్మాద దాడులకు వ్యతిరేకంగా సామ్రాజ్యవాదానికి ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ అన్నారు.

కడెం ప్రాజెక్టును సందర్శించిన అడిషనల్ కలెక్టర్

కడెం, సెప్టెంబర్ 1: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కడెం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్న విషయం తెలిసిందే. అయితే విషయం తెలుసుకున్న జిల్లా అడిషనల్ కలెక్టర్ కిషోర్‌కుమార్ ఆదివారం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయకట్టు అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం, ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ఇన్‌ఫ్లో, వరదగేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీటి వివరాలను నీటి పారుదలశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని, చేపల వేటకు వెళ్లకూడదని, గ్రామాల్లో డప్పు చాటింపు చేపట్టి ప్రజలను అప్రమత్తంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఆయనవెంట తహసీల్దార్ సుజాతరెడ్డి, రెవెన్యూ సిబ్బంది, తదితరులున్నారు.

4 నుంచి మాల సంక్షేమ సంఘం ఎన్నికలు

ఎదులాపురం,సెప్టెంబర్1: మాల సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నికలో భాగంగా ఈనెల 4 నుంచి గ్రామ, మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందని ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ సింగరి అశోక్ తెలిపారు. ఆదివారం న్యూ హౌజింగ్ బోర్డులోని సంఘ భవనంలో ఎన్నికల నిర్వహణపై సమావేశం నిర్వహించి గ్రామ, మండల కమిటీ ఎన్నికల తేదీని ప్రకటించారు. సంఘ సభ్యుల సూచనల మేరకు ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ సింగరి అశోక్ తెలిపారు. ఈనెల 4 నుంచి 14 వరకు గ్రామ కమిటీలు, 15 నుంచి 19 వరకు మండల కమిటీల ఎన్నిక ఉంటుందన్నారు. 20న ఓటరు జాబిత ప్రదర్శించి ఐడీ కార్డులను ఇస్తామన్నారు. ఐడీ కార్డులున్న వారు మాత్రమే జిల్లా కమిటీని ఎన్నుకోవడానికి అర్హులుగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ కన్వీనర్ చిన్నన్న, సభ్యులు సుభాష్, వినోద్, దయకర్, స్వామి, ఎల్పుల భూమన్న. మాజీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు అధిక సీట్లు కేటాయించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 01 : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమ్మర్తపు మురళి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదిలాబాద్ పద్మశాలి సంఘం భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా పద్మశాలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత వృత్తి ఉంటేనే పద్మశాలి సమాజానికి గుర్తింపు ఉంటుందని ఆ వృత్తిని కాపాడాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిదని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షులు మెతుకు సత్యం, కోశాధికారి బొమ్మ రఘురాం నేత, వాసల రమేష్, సెక్రెటరీ జెల్ల నరేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బేత రమేష్, జిల్లా కన్వీనర్ జక్కుల సత్యనారాయణ, ఆదిలాబాద్ తాలూకా పద్మశాలి సంఘం అధ్యక్షులు బొమ్మ కంటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మామడ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

నిర్మల్ చైన్‌గేట్, సెప్టెంబర్,1: జిల్లాలోని మామడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి రాజేందర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధిక వర్షాలు కురుస్తున్నందున అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అధిక జ్వరాలు ఉన్న గ్రామాలలో ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలని కోరారు. రోడ్లు తెగిపోయే ప్రమాదం ఉన్న గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న గర్భిణులను సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ నిర్వహణ అధికారి శ్రీనివాస్, ఆరోగ్య కేంద్రం అధికారి అరుణ్, సిబ్బంది ఉన్నారు.